క్లుప్తంగా

రేపు మోర్తాడ్‌కు మాతా సుదీక్ష



డిచ్‌పల్లి: సంత్ నిరంకారి మిషన్ అధిపతి, నిరంకారి సద్గురు మాతా సుదీక్ష, నిరంకారి రాజ్‌పితాజీ శుక్రవారం మోర్తాడ్‌లో జరగనున్న ఆధ్యాత్మిక కార్యక్రమానికి హాజరవుతున్నట్లు జోనల్ ఇన్‌చార్జి మోహిని అహుజా తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం 3.30 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు మోర్తాడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో మాతాజీ సమక్షంలో నిరంకారి సంత్ సమాగం నిర్వహిస్తారని తెలిపారు. భకులందరూ భాగస్వాములు కావాలని కోరారు.

మట్టి తరలిస్తున్న వాహనాల సీజ్



రెంజల్: మండలంలోని నీలా గ్రామ చెరువులో మట్టి తవ్వకాలను గ్రామస్తులు అడ్డుకున్నారు. బుధవారం గ్రామానికి చెందిన కొందరు చెరువులో తవ్వకాలు చేపట్టి విక్రయిస్తుండటంతో స్థానికులు అక్కడికి చేరుకుని అడ్డుకున్నారు. చెరువులో గుంతల తవ్వడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఎస్సై పండ్ల సాయన్న అక్కడికి చేరుకుని 3 ట్రాక్టర్లు, జేసీబీని స్టేషన్‌కు తరలించారు. ఎలాంటి అనుమతులు లేకపోవడంతో పట్టుబడిన వాహనాలను తహసీల్దార్‌కు సరెండర్ చేసినట్లు ఎస్సై వివరించారు.

జీపీ కార్మికులను ఢీకొన్న ఆటో



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మండలం గోవింద్‌పేట్ శివారులో డ్రెయినేజీ శుభ్రం చేస్తున్న పంచాయతీ కార్మికులను ఆటో ఢీకొంది. భీమ్‌గల్ నుంచి ఆర్మూర్ వైపు వస్తున్న ఆటో రోడ్డు పక్కన పని చేస్తున్న కార్మికులను వెనుక నుంచి ఢీకొంది. దీంతో ఆటో బోల్తా పడింది. ఇద్దరు కార్మికులు, ఆటోలో ప్రయాణిస్తున్న గర్భిణి గాయపడ్డారు. క్షతగాత్రులను ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్ తాగి ఉండడం వల్లే ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు.

బీమాను సద్వినియోగం చేసుకోవాలి



ఎల్లారెడ్డి: తపాలా శాఖ ద్వారా అమలు చేస్తున్న బీమాను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ ఉమామహేశ్వర్ కోరారు. బుధవారం ఆయన స్థానిక తపాలా కార్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతు గతంలో పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్సు కేవలం ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రమే ఉండేదని, దీనిని ప్రభుత్వం ప్రైవేటు రంగాలలో పని చేస్తున్న వారికి సైతం అవకాశం కల్పించినట్లు తెలిపారు. 19 ఏళ్ల నుంచి 55 ఏళ్లలోపు ఉన్నవారు ఈ పథకాన్ని వినియోగించు కోవాలని సూచించారు. కార్యక్రమంలో బీపీఎం సునిల్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పద్దుపై భిన్నాభిప్రాయాలు

కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌పై ప్రజలు మిశ్రమంగా స్పందించారు. బుధవారం ఆర్థికమంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై పలువురు తమ అభిప్రాయాలను 'సాక్షి'తో పంచుకున్నారు.

పీఆర్సీ ప్రయోజనాలపై దెబ్బ



సుభాష్‌నగర్: వేతన జీవులు ఆశించిన విధంగా కేంద్ర బడ్జెట్ లేదు. ఆదాయపు పన్ను మినహాయింపు రూ.10లక్షల వరకు పెంచితే బాగుండేది. ఉద్యోగుల డిమాండ్ మేరకు మినహాయింపులు చేస్తే మేలు జరిగేది. అరకొర ఐటీ పరిమితి పెంపుతో ఉద్యోగులు అసంతృప్తితో ఉన్నారు. పీఆర్సీతో జీతాలు పెరిగినా.. ఐటీ దెబ్బకు మూడు నెలల జీతాలు పన్ను రూపంలో చెల్లించాల్సి వస్తుంది.

– కె నాగరాజు, జిల్లా అధ్యక్షులు, తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్

ఉపాధ్యాయుల శిక్షణకు డిజిటల్ విద్యా విధానం



ఆర్మూర్: ఉపాధ్యాయులకు శిక్షణను డిజిటల్ విద్యా విధానాన్ని అమలులోకి తీసుకురావడంతో శిక్షణ సమయంలో మరింత లోతైన సమాచారిన్ని ఉపాధ్యాయులు పొందడానికి ఆస్కారం ఉండనుంది. అదేవిధంగా విశ్వకర్మల వికాస్ యోజన పథకం ద్వారా వెనకబడిన విశ్వకర్మల ఆర్థిక సంక్షేమానికి ఎంతగానో ఉపయోగకరంగా ఉండనుంది.

– గుండోజి నరేందర్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, ఆర్మూర్

నిరాశ పరిచింది



బడ్జెట్ ప్రజలను నిరాశ పర్చింది. తెలంగాణకు ప్రత్యేక నిధులు కేటాయించలేదు. నిజామాబాద్‌కు డబుల్ లైన్, కొత్త రైల్వే లైన్ పనుల గురించి ప్రస్తావించకపోవడం శోచనీయం. పసుపు బోర్డు ఏర్పాటుకు నిధులు కేటాయించకపోవడం నిరుత్సాహపర్చింది.

– రమేష్‌బాబు, సీపీఎం, జిల్లా కార్యదర్శి, నిజామాబాద్

పేద, మధ్య తరగతి బడ్జెట్



కేంద్ర బడ్జెట్ పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలకు మేలు చేకూర్చేలా ఉంది. ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కేటాయింపులు 400శాతం వరకు పెంచారు. పీఎం ఆవాజ్ యోజన పథకానికి రూ. 39వేల కోట్లు కేటాయించటంతో దేశవ్యాప్తంగా ఇండ్ల నిర్మిణాలు బాగా జరిగే అవకాశం ఉంది.

– పీఆర్ సోమాని, వ్యాపారవేత్త

పసుపు బోర్డు ప్రస్తావన లేకపోవడం విచారకరం



ఆర్మూర్: జిల్లా రైతాంగం పసుపు బోర్డుపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పసుపు బోర్డు ప్రస్తావన లేకపోవడం విచారకరం. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ కోటి మంది రైతులకు సహాయాన్ని అందించడం అభినందనీయమైనప్పటికీ జిల్లా రైతాంగం డిమాండ్ అయిన పసుపు బోర్డు ఏర్పాటుపై కేంద్ర ప్రభుత్వం పునరాలోచన చేయాల్సిన అవసరం ఉంది.

– పద్మ మురళి, వ్యాపారి, ఆర్మూర్

వ్యవసాయ అనుబంధ రంగాలకు ప్రోత్సాహం



వ్యవసాయ, అనుబంధ రంగాలను ప్రోత్సహిస్తూ కేటాయింపులు చేయడం శుభ పరిణామం. యువ పారిశ్రామికవేత్తల ద్వారా అగ్రిస్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు అగ్రికల్చర్ యాక్సిలరేటర్ ఫండ్ ఏర్పాటు చేస్తానమ్నారు. – తోకల సంపత్, అర్థశాస్త్ర విభాగాధిపతి, తెయూ

భారీ ఊరట



కేంద్ర బడ్జెట్‌లో ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆదాయ పన్ను మినహాయింపుతో భారీ ఊరట కల్పించింది. రూ.ఏడు లక్షల వరకు ఆదాయం పన్ను మినహాయించడం సంతోషకరం. గిరిజన ప్రాంతంలోని ఏకలవ్య పాఠశాలల్లో 38 వేల టీచర్ల భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం హర్షణీయం.

– కర్నె శంకర్, తపస్ రాష్ట్ర ప్రతినిధి, బోధన్

ప్రజావ్యతిరేక పద్దు



కార్పొరేట్ కంపెనీలకు ట్యాక్స్ మినహాయింపు ఇచ్చారు. ఇది వ్యవసాయ కార్మిక ప్రజావ్యతిరేక బడ్జెట్. పారిశ్రామిక రంగంపై స్పష్టత లేదు. పేద, మధ్యతరగతి ప్రజలపై భారం పడుతుంది. విద్యారంగంకు సరైన నిధులు కేటాయించలేదు.

– సుధాకర్, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి

పెన్షనర్లకు నిరాశ



కేంద్ర బడ్జెట్ పెన్షనర్లను నిరాశపర్చింది. నెలసరి ఫించన్‌పై ఆధారపడి జీవిస్తున్న పెన్షనర్లపై ఆదాయ పన్ను పూర్తి రద్దు చేయాలని ఏళ్లుగా కోరుతున్నాం. మధ్యతరగతి వర్గాల ప్రజలకు రూ.10 లక్షల వరకు ఆదాయ పన్ను మినహాయింపు ఇస్తారని ఆశించాం. పాత విధానం ప్రకారమే ఆరు స్లాబులు పెట్టి 30 శాతం పన్ను వసూళు చేసి సంపద పోగు చేసుకుంటున్న కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు 22 శాతం పన్ను విధించడం సమంజసం కాదు.

– అద్దంకి ఉషాన్, ఆల్ పెన్షనర్స్, రిటైర్డు అసోసియేషన్ బోధన్ డివిజన్ ప్రతినిధి

'ఉపాధి'కి నిధుల తగ్గింపు



కేంద్ర బడ్జెట్‌లో ఉపాధి హామీ పనులకు నిధులు తగ్గించారు. ఈ పథకానికి గత బడ్జెట్‌లో రూ.98 వేల కోట్లు కేటాయిస్తే, ప్రస్తుతం రూ.60 వేల కోట్లు కేటాయించారు.

– పి సుధాకర్, సీపీఐ జిల్లా కార్యదర్శి, నిజామాబాద్

నిధులు సరిపోవు



కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన నూతన జాతీయ విద్యా విధానానికి ఈ బడ్జెట్‌లో కేటాయించిన నిధులు సరిపోవు. జీడీపీలో 6 శాతం నిధులు కేటాయించాలి. విద్యా వైద్య వసతులను కల్పించకపోవడం శోచనీయం.

– పున్నయ్య, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెయూ

బంగారం వినియోగదారులపై ప్రభావం



బంగారు అభరణాలపై ట్యాక్స్‌లు పెంచారు. ఇది వినియోగదారులపై ప్రభావం పడుతుంది. దేశంలో బంగారం దిగుమతులు ఎక్కువగా ఉండటంతో రూపాయి విలువ పడిపోతోంది.

– పొల్దె లక్ష్మీకాంతం, బంగారం వెండి వర్తక సంఘం అధ్యక్షుడు, నిజామాబాద్

హర్షణీయం



ఆర్మూర్: ఆదాయపు పన్ను పరిమితిని రూ.ఐదు లక్షల నుంచి రూ.ఏడు లక్షలకు పెంచడం హర్షణీయం. చాలా మంది టాక్స్ పేయర్స్‌కు ఊరట లభించనుంది.

– ఈరవత్రి రాజశేఖర్, చార్టెడ్ అకౌంటెంట్, ఆర్మూర్

కేంద్రం వివక్ష చూపుతోంది



కేంద్ర ప్రభుత్వం తెలంగాణపై వివక్ష చూపిస్తోంది. కేంద్ర, రాష్ట్రాల మధ్య తండ్రీకొడుకుల వలె సఖ్యత ఉండాలి. తెలంగాణ నుంచి రూ.3.68లక్షల కోట్ల ఆదాయం తీసుకున్న కేంద్రం తిరిగి రాష్ట్రానికి ఇచ్చింది మాత్రం రూ.1.68లక్షల కోట్లు మాత్రమే. కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలని నీతిఆయోగ్ చెప్పినప్పటికీ ఇవ్వకపోవడం శోచనీయం.

– దాదన్నగారి విఠల్‌రావు, జెడ్పీ చైర్మన్

రూ.3లక్షల నుంచి లెక్కించడం సరికాదు..



కమ్మర్‌పల్లి: పన్ను మినహాయింపును రూ.ఏడు లక్షలకు పెంచి.. ఆదాయం రూ.ఏడు లక్షలు దాటిన వారికి రూ.3 లక్షల నుంచే పన్ను వేయడం సరికాదు. ఏడాదికి రూ. 7.01 లక్షల జీతం ఉన్న ఉద్యోగి రూ. 25 వేల పన్ను చెల్లించాల్సి వస్తుంది.

– కుంట గంగారెడ్డి, సెర్ప్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీఎం

చేతల్లో చూపించాలి



బడ్జెట్‌లో రైతులకు పంట రుణాల కోసం భారీగా నిధులు కేటాయించడం బాగానే ఉంది. ఆచరణలో అమలు చేస్తే బాగుంటుంది. బ్యాంకులు ఉన్నవారికే రుణాలు ఇస్తున్నాయి.

– బద్దం రాజశేఖర్, రైతు, తిమ్మాపూర్

స్వాగతిస్తున్నాం



నిజామాబాద్‌సిటీ: ప్రతీ మధ్యతరగతి కుటుంబానికి రూ.7లక్షల వరకు పన్ను మినహాయింపు ఇవ్వడాన్ని తెలుగుదేశం పార్టీ స్వాగతిస్తోంది. ఇది చాలా మందికి ఊరట కలిగించే విషయం. కేంద్ర ప్రభుత్వం మున్ముందు పేదల కోసం ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటే మరింత బాగుంటుంది.

– దేగాం యాదాగౌడ్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు

మధ్య తరగతికి మేలు



రూ.ఏడు లక్షల వరకు ఆదాయం పన్ను మినహాయింపుతో ఉద్యోగ, ఉపాధ్యాయులతో పాటు మధ్యతరగతి వర్గాల ప్రజలు, చిరు వ్యాపారులకు లబ్ధి చేకూరుతోంది. రూ.ఏడు లక్షలకు మించిన ఆదాయం ఉన్న వారికి ఐదు స్లాబుల్లో పన్ను విధించడం వేతన జీవులకు ఊరట లభిస్తుంది. – ఎంబెల్లి శంకర్, పీఆర్‌టీయూ బోధన్ డివిజన్ అధ్యక్షుడు

పేదల బడ్జెట్



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పేదలకు వరం లాంటిది. ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడానికి ప్రభుత్వం ఈ బడ్జెట్ ప్రవేశపెట్టింది. ఉద్యోగులకు ఆదాయ పన్ను పరిమితి పెంచడం హర్షణీయం. వ్యవసాయ రంగానికి పెద్ద ఎత్తున నిధులు కేటాయించింది.

– ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తా, బీజేపీ అర్బన్ నియోజకవర్గ నాయకుడు

ప్రతి ఒక్కరికి లబ్ధి చేకూర్చేలా..



సమ్మిళిత వృద్ధి చిట్టచివరి వ్యక్తికి కూడా చేకూరేలా బడ్జెట్ ఉంది. రూ.ఏడు లక్షల వరకు ఇన్‌కమ్ టాక్స్ మినహాయింపు ఇవ్వడం మంచి విషయమే. కొత్త పన్ను స్లాబ్ విధానాన్ని ఎంచుకున్న వారికి మాత్రమే ఇవ్వడం సరైంది కాదని చెప్పవచ్చు. – పాత నాగరాజు, అసోసియేట్ ప్రొఫెసర్, తెయూ

ప్రకృతి సేద్యానికి నిధులు



ప్రకృతి సేద్యానికి ప్రోత్సాహం అందించడానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించడం బాగుంది. రసాయన ఎరువుల వాడకంతో ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుంది. పాత పద్ధతిలో వ్యవసాయం చేయడమే మేలు. – తక్కురి సాగర్, రైతు, మోర్తాడ్

విద్యారంగానికి అధిక కేటాయింపులు



కామారెడ్డి అర్బన్: కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి పెద్దపీట వేశారు. దేశ వ్యాప్తంగా ఏకలవ్య పాఠశాలలో 38వేల టీచర్ల నియామకం, 740 ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాలల ఏర్పాటు, జాతీయ డిజిటల్ లైబ్రరీల ఏర్పాటు, యువతకు నైపుణ్యాలు అందించడం, వైద్యవిద్య కోర్సుల్లో మల్టిడిసిప్లినరీ కోర్సులు, ఉపాధ్యాయ విద్యలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం అనుకూల అంశాలుగా ఉన్నాయి. రూ.40వేల కోట్లు విద్యా రంగానికి కేటాయించడం హర్షణీయం. – డాక్టర్ బాలు, కామారెడ్డి

కార్పొరేట్ కంపెనీల అనుకూల బడ్జెట్



కేంద్ర బడ్జెట్ కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా ఉంది. పేద ప్రజలకు వ్యతిరేకంగా ఉంది. నిరుద్యోగులకు నిరాశనే. వ్యవసాయ రంగం దివాలా తీసే విధంగా నిధులు కేటాయించారు.

– వెంకటిగౌడ్, సీపీఎం జిల్లా కార్యాదర్శి, కామారెడ్డి

విద్యా రంగానికి 2.6శాతమే నిధులు



కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో విద్యాశాఖకు 10శాతం నిధులు కేటాయించాల్సి ఉండగా 2.6శాతమే కేటాయించింది. కార్పొరేట్ విద్యాసంస్థలకు మేలు జరిగేలా కేంద్రం వ్యవహరిస్తుంది. విద్యకు సంబంధించిన అన్ని వస్తువులపై జీఎస్టీ ఎత్తివేయకుండా అదనపు భారం మోపడం సరికాదు.

– జీవీఎం విఠల్, భారతీయ విద్యార్థి మోర్చా రాష్ట్ర కార్యదర్శి

క్రైం కార్నర్

భార్య కాపురానికి రావడం లేదని ఆత్మహత్య



ప్రవీణ్ (ఫైల్)

కామారెడ్డి క్రైం: భార్య కాపురానికి రావడం లేదని జీవితంపై విరక్తి చెందిన ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని టేక్రియాల్‌లో బుధవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన చెవిటి ప్రవీణ్ (30)కు దేవునిపల్లికి చెందిన లాస్యతో ఐదేళ్ల క్రితం వివాహం జరిగింది. వారికి మూడేళ్ల కుమారుడు ఉన్నాడు. భార్యాభర్తల మధ్య గొడవల కారణంగా యేడాదిగా లాస్య తన తల్లిగారింట్లో ఉంటుంది. భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపం చెందిన ప్రవీణ్ ఇంట్లో దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దేవునిపల్లి పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ జరిపారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై బాల్‌రెడ్డి తెలిపారు.

జీవితంపై విరక్తితో ఒకరు..

నవీపేట: మండలంలోని జన్నెపల్లి గ్రామానికి చెందిన బోడ నరేందర్(52) బుధవారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై రాజారెడ్డి తెలిపారు. కొన్ని రోజులుగా మద్యానికి బానిసైన నరేందర్ తరచూ భార్యతో గొడవ పడేవాడు. దీంతో 15 రోజుల కిందట భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. తాగుడికి బానిసై జీవితంపై విరక్తి చెందిన నరేందర్ ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు చేశామని ఎస్సై తెలిపారు.

లారీలో నుంచి పడ్డ చెరుకు



ఇందల్వాయి: నిజామాబాద్ నుంచి సదాశివనగర్ మండలంలోని గాయత్రి షుగర్ ఫ్యాక్టరీకి వెళ్తున్న లారీలో నుంచి చెరుకు కింద పడింది. జాతీయ రహదారిపై మండలంలోని మిషన్ భగీరథ వాటర్ ప్లాంట్ వద్ద బుధవారం మధ్యాహ్నం పెద్ద మొత్తంలో చెరుకు మోపులు కూలి కింద పడటంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న టోల్‌ప్లాజా సిబ్బంది చెరుకును తొలగించారు.

హాస్టల్‌లో సమస్యలు పరిష్కరించాలని ధర్నా



ముదక్‌పల్లి చౌరస్తాలో ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థులు

మోపాల్: మండలంలోని ముదక్‌పల్లిలో గిరిజన సంక్షేమ హాస్టల్‌లో సమస్యలు పరిష్కరించాలని బుధవారం ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు ధర్నా చేశారు. ఏఐఎస్‌ఎఫ్ నాయకులు నవీన్ మాట్లాడుతూ హాస్టల్ సిబ్బంది మెనూ పాటించడం లేదని, నాసిరకం భోజనం పెడుతున్నారని ఆరోపించారు. అలాగే కిటికీలు, డోర్లు, మూత్రశాలలు సరిగ్గా లేవని, గదుల్లో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా వేలాడుతున్నాయన్నారు. అధికారులు హామీనివ్వడంతో ఆందోళనను విరమించారు. నితిన్, భాస్కర్, చరణ్, మనోహర్, నితిన్, విద్యార్థులు పాల్గొన్నారు.

వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని హత్య



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జగన్నాథ్‌రెడ్డి

బాన్సువాడటౌన్: వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని ఒకరిని హత్య చేశారు. నస్రుల్లాబాద్ మండలం అంకోల్ గ్రామానికి చెందిన నీరడి శ్రీనివాస్(40) హత్య కేసును పోలీసులు ఛేదించారు. బుధవారం బాన్సువాడ రూరల్ పోలీ స్టేషన్‌లో డీఎస్పీ జగన్నాథ్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. శ్రీనివాస్ భార్యకు అదే గ్రామానికి చెందిన కిషన్ గౌడ్ అనే వ్యక్తికి వివాహేత సంబంధం ఉంది. ఈ విషయమై పలుమార్లు శ్రీనివాస్‌కు, కిషన్‌గౌడ్‌కు గొడవ జరిగింది. దీంతో ఎలాగైనా శ్రీనివాస్‌ను చంపాలని కిషన్‌గౌడ్ పథకం వేశాడు. దీనికోసం బాలయ్య, సురేష్‌గౌడ్, కేతవత్ రవి, గొట్టం శ్రీకాంత్ సాయం తీసుకున్నాడు. గత నెల 29న నీరడి శ్రీనివాస్‌ను బాలయ్య అనే నిందితుడు అంకోల్ గ్రామ శివారులోకి తీసుకెళ్లాడు. అప్పటికే అక్కడ ఉన్న మిగతా నలుగురు నిందితులు శ్రీనివాస్‌కు అతిగా మద్యం తాగించారు. అనంతరం నోట్లోకి మద్యం సీసాను బలవంతంగా నొక్కి సీసాను కాలితో గట్టిగా తన్నడంతో గొంతులో మద్యం సీసా గుచ్చుకుని శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందాడు. బుధవారం అంకోల్ క్యాంపు, బాన్సువాడలో నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. హత్య కేసు ఛేదించిన రూరల్ సీఐ మురళి, నస్రూల్లాబాద్ ఎస్సై రంజిత్‌రెడ్డితో పాటు సిబ్బందిని ఎస్పీ అభినందించారని డీఎస్పీ అన్నారు.

బైకు అదుపు తప్పి ఇద్దరి మృతి



ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ధర్పల్లి: బైకు అదుపు తప్పి ఇద్దరు మృతి చెందిన ఘటన ధర్పల్లి మండల కేంద్రం శివారులో చోటుచేసుకుంది. వివరాలు.. సిరికొండ మండలం పెద్దవాల్గొట్ గ్రామానికి చెందిన కృష్ణ (48) ఇందల్వాయి మండలం గన్నారం గ్రామానికి చెందిన శ్రీనివాస్ (45) ధర్పల్లిలోని దేశాయి బీడీ కంపెనీలో ప్యాకింగ్ కార్మికులుగా పనిచేస్తున్నారు. మంగళవారం సాయంత్రం వీరు ఇద్దరూ ధర్పల్లిలో ఒక శుభకార్యానికి హాజరయ్యారు. అనంతరం శ్రీనివాస్, కృష్ణను ఇంటి వద్ద దింపడానికి ధర్పల్లి నుంచి పెద్దవాల్గోట్ గ్రామానికి బైకుపై బయలుదేరారు. మార్గ మధ్యలో కోళ్ల ఫారం మలుపు వద్ద బైకు అదుపు తప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. ఇద్దరికి బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. బుధవారం ఉదయం మృతదేహాలను చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఈ ప్రమాదం మంగళవారం అర్ధరాత్రి రెండు గంటల సమయంలో జరిగినట్లు ఎస్సై వంశీ కృష్ణారెడ్డి తెలిపారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

చేపల వేటకు వెళ్లి మృత్యువాత

లింగంపేట: మండలంలోని ఒంటర్‌పల్లి గ్రామానికి చెందిన పెద్ది శివయ్య(51) చెరువులో పడి మృతి చెందినట్లు ఎస్సై శంకర్ తెలిపారు. వివరాలు.. శివయ్య మంగళవారం సాయంత్రం గ్రామ శివారులోని కొత్త చెరువులో చేపలు పట్టడానికి భార్య సాయవ్వతో కలిసి వెళ్లాడు. చీకటి పడటంతో భార్య ఇంటికి వచ్చింది. రాత్రి సమయంలో చెరువులో వేసిన గాలాలు తీసే క్రమంలో కాలు జారి శివయ్య చెరువులో పడిపోయాడు. రాత్రి అయినా శివ్వయ్య ఇంటికి రాకపోవడంతో తిరిగి చెరువు దగ్గరకు వెళ్లి చూడగా తాను తీసుకెళ్లిన ఎక్సెల్ వాహనం, బట్టలు గట్టుపై ఉన్నాయి. చుట్టు పక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. బుధవారం ఉదయం గ్రామస్తులు చెరువులో వెతకగా శివయ్య మృతదేహం లభ్యమైనట్లు తెలిపారు. మృతునికి భార్య ఇద్దరు కూతుర్లు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

బైక్‌పై నుంచి పడి ఒకరు..

లింగంపేట: లింగంపేట మండలం పొల్కంపేట గ్రామ శివారులో బుధవారం సంఘమేశ్వర్(45) అనే వ్యక్తి బైక్‌పై నుంచి పడి మృతి చెందినట్లు ఎస్సై శంకర్ తెలిపారు. వివరాలు.. మెదక్ జిల్లా హవేలి ఘన్‌పూర్ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన సంగమేశ్వర్ స్వగ్రామంలో పాత టీవీఎస్ ఎక్సెల్ కొనుగోలు చేశాడు. దానిని రిపేర్ చేయించడానికి అదే గ్రామానికి చెందిన చత్తారి చిన్న మల్లయ్య బైక్‌కు తాడు కట్టి లాగుతూ లింగంపేటకు బయలుదేరారు. పొల్కంపేట శివారులోని సబ్‌స్టేషన్ సమీపంలో బైక్‌ను వేగంగా తీసుకెళ్లడంతో టీవీఎస్ ఎక్సెల్ అదుపు తప్పి రోడ్డుపై పడింది. దీంతో సంఘమేశ్వర్ తలకు తీవ్ర గాయాలు కాగా ఎల్లారెడ్డి తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుడి భార్య రామవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కిడ్నాప్ కేసు నిందితుల రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై నర్సింలు

సిరికొండ: మండలంలోని గడ్కోల్ గ్రామానికి చెందిన గుర్జుకింది సతీష్‌ను కిడ్నాప్ చేసిన నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై నర్సింలు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఆయన కేసు వివరాలను వెల్లడించారు. భీమ్‌గల్‌కు చెందిన మల్లేష్ తన అనుచరులైన శ్రావణ్, పూజిత్, జింక మహేష్, దినేష్‌తో పాటు మరో ముగ్గురి సహాయంతో సతీష్‌ను గత నెల 30న కిడ్నాప్ చేశారని తెలిపారు. కిడ్నాప్‌నకు గురైన వ్యక్తిని విడిపించి, నేరస్తులను కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్సై తెలిపారు. కిడ్నాప్‌నకు ఉపయోగించిన కారు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు.

క్లుప్తంగా

ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి



నిజామాబాద్ అర్బన్ : కేంద్రం వెంటనే ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు నాగభూషణం డిమాండ్ చేశారు. బుధవారం ఆర్అండ్బీ గెస్ట్‌హౌస్‌లో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై కేంద్రం నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు. ఈనెల 13న పీఎం మోదీ పర్యటన నేపథ్యంలో మహాజన నేత మందకృష్ణ తలపెట్టిన హైదరాబాద్ నుంచి విజయవాడ జాతీయ రహదారుల దిగ్బంధం చేసే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా కోఆర్డినేటర్ డల్లా సురేష్ మహాజన్, ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ కనక ప్రమోద్, నియోజకవర్గ కోఆర్డినేటర్లు మైలారం బాలు, యాదాశి రాములు, యమున తదితరులున్నారు.

ఏసీడీ చార్జీల వసూళ్లను నిలిపేయాలి



నిజామాబాద్ నాగారం : పేదల నుంచి వసూలు చేస్తున్న ఏసీడీ చార్జీల వసూళ్లను నిలిపేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నిజామాబాద్ డివిజన్ కార్యదర్శి వేల్పూర్ భూమయ్య డిమాండ్ చేశారు. ఏసీడీ చార్జీలను నిరసిస్తూ బుధవారం అర్బన్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఎదుట న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి నుడా చైర్మన్ ప్రభాకర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో న్యూడెమోక్రసీ నాయకులు నీలం సాయిబాబా, దేశెట్టి సాయి రెడ్డి, శివ కుమార్, జన్నారపు రాజేశ్వర్ తదితరులున్నారు.

ఉప సర్పంచుల ఫోరం మండల కమిటీ ఎన్నిక



ధర్పల్లి : ధర్పల్లి మండలం ఉప సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా మండలంలోని దుబ్బాక ఉపసర్పంచ్ ప్రతాప్ గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం ఉప సర్పంచులు సమావేశం ఏర్పాటు చేసి ఫోరాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ప్రతాప్ గౌడ్, ఉపాధ్యక్షుడిగా నిశాంత్, ప్రధాన కార్యదర్శిగా భారతిరాణి, సభ్యులుగా లలిత, గంగా నర్సు, మహేశ్, బుచ్చన్న, సంతోష్ ఎన్నికయ్యారు.

భాషా పండితులను అప్‌గ్రేడ్ చేయాలి



సిరికొండ : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పదోన్నతులు బదిలీల్లో భాగంగా భాషా పండితులను అప్‌గ్రేడ్ చేయాలని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో పీజీ హెచ్ఎం సీతాదేవికి భాష పండితులు బుధవారం వినతిపత్రం అందచేశారు. భాష పండితులను అప్‌గ్రేడ్ చేయకపోతే 9, 10 తరగతులకు బోధనను బహిష్కరిస్తామన్నారు. జాబ్‌చార్ట్ ద్వారా తాము పనిచేయాల్సిన 6, 7, 8 తరగతులకు మాత్రమే బోధన చేస్తామన్నారు. హిందీ ఉపాధ్యాయులు గంగాధర్, యూసుఫ్‌ఖాన్, సునీత, అన్నపూర్ణ, మోతీలాల్, సీఆర్పీ కృష్ణవేణి, జమున తదితరులు పాల్గొన్నారు.

1,092 మందికి కంటి పరీక్షలు



నిజామాబాద్ సిటీ : రూరల్‌లోని మండలం మల్లారంలో కంటి వెలుగు శిబిరం బుధవారంతో ముగిసింది. గ్రామంలో జనవరి 19న కంటి వెలుగు శిబిరం ప్రారంభమైన సంగతి తెలిసిందే. గతనెల 19 నుంచి ఫిబ్రవరి 1 వరకు గ్రామంలో 1092 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 136 మందికి రీడింగ్ అద్దాలు పంపిణీ చేయగా, 84 మందికి దూరపు చూపు అద్దాలు అవసరమని గుర్తించారు. ఈ అద్దాలు కోసం అర్డర్ ఇవ్వటం జరిగిందని, 15 రోజుల్లోపు అద్దాలు వచ్చాక వీటిని పంపిణీ చేయనున్నట్లు వైద్యులు తెలిపారు.

కలెక్టర్ సేవలు అభినందనీయం

నిజామాబాద్ నాగారం : బదిలీపై వికారాబాద్ జిల్లాకు కలెక్టర్‌గా వెళ్తున్న నారాయణ రెడ్డిని బుధవారం రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంతి ఉద్యోగుల సంఘం నాయకులు ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. గత మూడేళ్లుగా కలెక్టర్‌గా నారాయణరెడ్డి అందించిన సేవలను ప్రశంసిస్తూ జిల్లాకు జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడమే కాకుండా ఎప్పటికప్పుడు ఉద్యోగులకు విశ్రాంతి ఉద్యోగులకు సహాయ సహకారాలందించారన్నారు. విశ్రాంతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు రవీందర్, ప్రధాన కార్యదర్శి భోజాగౌడ్, కోశాధికారి ఆశయ్య తాలూకా బాధ్యులు రంగయ్య తదితరులు ఉన్నారు.



బదిలీపై వెళ్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి దంపతులను సన్మానిస్తున్న పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు

కొత్త కలెక్టర్‌కు ఘన స్వాగతం



కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న టీఎన్జీవో నాయకులు



శుభాకాంక్షలు తెలియజేస్తున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్



పుష్పగుచ్ఛం అందిస్తున్న అడిషనల్ కలెక్టర్ చిత్రామిశ్రా



ఇందల్వాయి టోల్‌గేట్ వద్ద కలెక్టర్‌కు స్వాగతం పలుకుతున్న తహసీల్దార్ రోజా తదితరులు



పుష్పగుచ్ఛం అందజేస్తున్న రెవెన్యూ ఉద్యోగులు



పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీఎఫ్‌వో వికాస్‌రాజ్

ఇందల్వాయి టోల్‌గేట్ వద్ద..

ఇందల్వాయి : జిల్లాకు నూతన కలెక్టర్‌గా నియమితులైన తర్వాత బుధవారం జిల్లాకు వచ్చిన రాజీవ్ గాంధీ హనుమంతుకు ఇందల్వాయి టోల్‌ప్లాజా వద్ద తహసీల్దార్ రోజా, కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఆర్ఐ వహీద్, డీటీ చందన తదితరులు ఉన్నారు.



పుష్పగుచ్ఛం అందజేస్తున్న కాంగ్రెస్ మైనారిటీ నాయకుడు ఖైసర్



శుభాకాంక్షలు తెలియజేస్తున్న మాజీ సర్పంచ్ చిన్నారెడ్డి

ప్రతిష్ఠాపనోత్సవాలు ప్రారంభం



నగరంలోని పంచముఖి హనుమాన్ ఆలయంలో యజ్ఞం చేస్తున్న భక్తులు



ఘన్‌పూర్‌లో కాశీ విశ్వేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాల్లో పాల్గొన్న భక్తులు

నిజామాబాద్ సిటీ : నగరంలోని న్యూహౌసింగ్‌బోర్డు కాలనీ (వినాయక్‌నగర్) శ్రీ పంచముఖి హనుమాన్ ఆలయంలో మూడురోజుల ఉత్సవాల కార్యక్రమంలో భాగంగా బుధవారం విగ్రహాల ప్రతిష్ఠాపన కోసం యజ్ఞ కార్యక్రమం ప్రారంభమైంది. ఆలయ కమిటీ చైర్మన్, కార్పొరేటర్ మల్లేశ్ యాదవ్ అధ్యక్షతన, ఆలయ పున:నిర్మాణ కమిటీ చైర్మన్ నంగునూరు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరుగుతున్నాయి. బుధవారం హనుమాన్ జంక్షన్ నుంచి శ్రీ పంచముఖి వీరాంజనేయ ఆలయం వరకు విగ్రహాల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ధ్వజస్తంభ, విజయ గణపతి, దత్తాత్రేయ, నవగ్రహా, సంతాన నాగేంద్రుల విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. దీనికోసం మొదటిరోజు ఆలయం ఆవరణలో శ్రీ పంచముఖి ఆలయం, ఎల్లమ్మగుట్ట ఆలయం, ఉమామహేశ్వర దేవాలయం ప్రధాన అర్చకులు కాషాపురం రాజేశ్వర శర్మ, గోపి రాజ్ వెంకటేశ్వర శర్మ, చెఱకు కృష్ణ ప్రసాద్ శర్మలు యజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు.

డిచ్‌పల్లిలో..

డిచ్‌పల్లి : మండలంలోని ఘన్‌పూర్‌లో నూతనంగా నిర్మించిన కాశీ విశ్వేశ్వర ఆలయంలో బుధవారం విగ్రహప్రతిష్ఠాపనోత్సవ వేడుకలు వైభవంగా ప్రారంభమయ్యాయి. శ్రీకాశీ విశ్వేశ్వర స్వామి వారి సపరివార సమేత విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం నుంచి ప్రత్యేక కార్యక్రమాలను ఆలయ ప్రధానార్చకులు ప్రదీప్ దేశ్‌పాండే నిర్వహించారు. సాయంత్రం మంగళహారతులతో గ్రామంలో విగ్రహాల ఊరేగింపు, విగ్రహాల జలాధివాసం, హారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ వేడుకల్లో సర్పంచ్ శక్కరికొండ కవిత మోహన్, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యుడు, గ్రామస్తులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

5న శ్రీ సుదర్శన నారసింహ మహాయజ్ఞం

నిజామాబాద్ సిటీ : ఈనెల 5న(ఆదివారం) నగరంలోని ప్రభుత్వ ఐటీఐ మైదానం(శివాజీనగర్)లో సుదర్శన నారసింహ మహాయజ్ఞం కార్యక్రమాన్ని నిర్వహించటం జరుగుతుందని కందాకై నరసింహ మూర్తి(నాని స్వామి) బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహాయజ్ఞం కార్యక్రమానికి త్రిదండి శఠగోప రామానుజ జీయర్ శ్రీవిల్లి పుత్తూర్ స్వామి(తమిళనాడు) ఆచార్య రామానుజ దాస స్వామి శ్రీ వైష్ణవ గంగ్రోత్రి మఠం(హిమలయం) స్వాములు హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. 5న ఐటీఐ మైదానంలో ఉదయం నుంచి యజ్ఞం ప్రారంభమవుతుందన్నారు. యజ్ఞం అనంతరం సమేత వేంకటేశ్వర కల్యాణం, లక్ష్మీ నారసింహ కల్యాణం, సీతారామ కల్యాణం జరుగుతుందన్నారు. పైమూడు కల్యాణాల్లో పాల్గొనే వారు నానిస్వామిని సంప్రదించాలన్నారు.

రత్నాలకల్లం హనుమాన్ ఆలయానికి విరాళం



ఆలయ కమిటీకి రశీదును అందజేస్తున్న ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా

సుభాష్‌నగర్ : నగరంలోని ఎల్లమ్మగుట్టలోని రత్నాలకల్లం హనుమాన్ ఆలయ పునర్నిర్మాణానికి బీజేపీ నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గ నాయకుడు ధన్‌పాల్ సూర్యనారాయణ బుధవారం రూ. 2.51 లక్షలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధికి ముందుంటానని, భవిష్యత్‌లోనూ తనవంతు విరాళాలు అందజేస్తానన్నారు. దేవాలయాలకు విరాళం ఇవ్వడం తన పూర్వజన్మ సుకృతమన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ న్యాలం రాజు, యెండల సురేశ్, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ధర్పల్లి జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్

డిచ్‌పల్లి : నిరుద్యోగులకు మెరుగైన శిక్షణ ఇచ్చి ప్రభుత్వ ఉద్యోగాలు పొందేలా శిక్షణ ఇచ్చే కౌండిన్య పోలీస్ డిఫెన్స్ అకాడమిలో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత శిక్షణను ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని ధర్పల్లి జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్ సూచించారు. డిచ్‌పల్లి మండలం సుద్దపల్లి గ్రామంలో కౌండిన్య పోలీస్ డిఫెన్స్ అకాడమీ ఉచిత శిక్షణ తరగతులను బుధవారం జగన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానికంగా ఉచిత కోచింగ్ సెంటర్లు పెట్టి నిరుద్యోగులకు మెరుగైన శిక్షణ ఇప్పించాలని సీఎం కేసీఆర్ సూచన మేరకు రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ సహకారంలో ఉచిత శిక్షణ ఇప్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చింత శ్రీనివాసరెడ్డి, సీనియర్ దాసరి లక్ష్మీనర్సయ్య, శక్కరికొండ కృష్ణ, అకాడమీ నిర్వాహకులు రాజాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మ స్ఫూర్తితో ముందుకెళ్లాలి

డిచ్‌పల్లి : తొలిదశ తెలంగాణ ఉద్యమకారిణి చాకలి ఐలమ్మ స్ఫూర్తిగా మహిళలు ధైర్యంగా ముందుకు సాగాలని జిల్లా ఒలింపిక్ సంఘం ఉపాధ్యక్షులు, ధర్పల్లి జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్ సూచించారు. బుధవారం డిచ్‌పల్లి ఖిల్లా గ్రామంలో ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ విగ్రహాన్ని బాజిరెడ్డి జగన్ ఆవిష్కరించారు. సీఎం కేసీఆర్ చొరవతో తెలంగాణ వీరుల జీవిత చరిత్రలను మన పాఠ్యపుస్తకాల్లో ప్రచురించి ప్రజలకు తెలిసేలా కృషి చేస్తున్నారన్నారు. విగ్రహదాత టీఎస్ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌కు గ్రామ రజక సంఘం సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐడీసీఎంఎస్ చైర్మన్ సాంబారి మోహన్, సర్పంచ్ గడ్డం రాధ కిష్టారెడ్డి, డిచ్‌పల్లి సొసైటీ చైర్మన్ గజవాడ జైపాల్, ఎంపీటీసీ కొత్తూరు మానస సాయి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చింత శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ నాయకులు దాసరి లక్ష్మీనర్సయ్య, శక్కరికొండ కృష్ణ, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, జీనియస్ నారాయణరెడ్డి తదితరులున్నారు.

తాగునీటి కోసం రాస్తారోకో

కోటగిరి : తమకు కొన్నాళ్లుగా మిషన్ భగీరథ తాగునీరు సక్రమంగా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తూ బుధవారం కోటగిరి మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ వాసులు రుద్రూర్- పోతంగల్ ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. భగీరథ నీటిని రోజుకు రెండు పూటలు ఇవ్వాలని స్పీకర్ పోచారం అధికారులకు ఆదేశాలు జారీ చేసినా, ఒక్కో వ్యక్తికి 100 లీటర్లు మాత్రమే అంటూ అధికారులు చెబుతున్నారని, ఇంటి అవసరాలకు ఈ నీరు ఏవిధంగా సరిపోతుందని ప్రశ్నించారు.

సైబర్ నేరాలతో జాగ్రత్తగా ఉండండి



మాట్లాడుతున్న వర్ని ఎస్సై అనిల్ రెడ్డి

వర్ని/బోధన్ టౌన్/బాల్కొండ: సైబర్ నేరాలతో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని వర్ని ఎస్సై అనిల్ రెడ్డి, బోధన్ పట్టణ సీఐ ప్రేమ్ కుమార్, మెండోరా పోలీసు స్పింది సూచించారు. బుధవారం వర్ని మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో, బోధన్ పట్టణంలోని చైతన్య వొకేషన్ కళాశాలలో, మెండోరా మండల పోచంపాడ్ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఫోన్లలో అనవసరమైన యాప్‌లను ఇన్‌స్టాల్ చేసుకోవద్దని, ఇతరులకు ఓటీపీలను చెప్పొద్దని, బ్యాంకు వివరాలు, వ్యక్తిగత సమాచారాన్ని అపరిచితులకు చెప్పరాదని సూచించారు. రోడ్డు భద్రతా నియమాలను పాటించాలన్నారు. ఎవరైనా మోసపోతే పోలీస్ స్టేషన్‌లో లేదా 100కు ఫిర్యాదు చేయాలని, ఈ విషయాలపై తల్లిదండ్రులకు కూడా విద్యార్థులు అవగాహన కల్పించాలన్నారు.

ప్రథమ చికిత్సపై అవగాహన ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ నారాయణ

డిచ్‌పల్లి : రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు బాధితులకు వెంటనే ప్రథమ చికిత్స అందజేస్తే వారి ప్రాణాలను కాపాడిన వారమవుతాయని, ప్రథమ చికిత్సపై అవగాహన ఉండాలని నిజామాబాద్ ట్రాఫిక్ ఏసీపీ నారాయణ, నిజామాబాద్ ఏసీపీ ఎ.వెంకటేశ్వర్ అన్నారు. 'రోడ్డు ప్రమాదాలు జరిగిన వెంటనే తీసుకోవాల్సిన ప్రథమ చికిత్స శిక్షణ' అనే అంశంపై డిచ్‌పల్లి మండల కేంద్రంలోని ఎస్ఎల్‌జీ గార్డెన్స్‌లో బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నిజామాబాద్ పోలీస్ కమీషనరేటు పరిధిలోని డిచ్ పల్లి, ఆర్మూర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో జాతీయ, రాష్ట్ర రహదారులు ఉన్నాయన్నారు. 2022లో 668 రోడ్డు ప్రమాదాలు జరుగగా, 322 మంది మృతి చెందగా, 659 మందికి గాయాల పాలైనట్లు తెలిపారు. ఎక్కడైనా రోడ్డు ప్రమాదం జరిగితే ప్రథమ చికిత్స తప్పకుండా అందించి దగ్గరలోని ఆస్పత్రికి చేర్చాలని సూచించారు. కార్యక్రమంలో నిజామాబాద్ డీఎస్పీ (రోడ్ సేఫ్టీ, హైదరాబాద్), ఎస్.చంద్రభాను, డిచ్‌పల్లి సీఐ డి.మోహన్, ఈఎంఆర్ఐ ట్రైనర్స్ సుమన్, మధుసూదన్‌రావు, ఎస్సైలు కే.గణేష్, మహేష్, సాయి కుమార్, సీసీఆర్‌బీ ఏఎస్సై రాజేంద్రప్రసాద్, విద్యాసాగర్, చేయూత వాలంటరీ ఆర్గనైజేషన్ సభ్యులు, ఆటో డ్రైవర్లు, వ్యాపారులు పాల్గొన్నారు.

విద్యారంగానికి అధిక నిధులివ్వాలి



సంతకాలు చేస్తున్న విద్యార్థులు

తెయూ(డిచ్‌పల్లి) : తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ తెయూ పీడీఎస్‌యూ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం క్యాంపస్ ఆవరణలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి, వర్సిటీ కన్వీనర్ కర్క గణేష్ మాట్లాడుతూ ప్రాథమిక విద్యావ్యవస్థ మొదలుకుని యూనివర్సిటీల వరకు టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టుల ఖాళీలను భర్తీ చేయకపోవడంతో గ్రామీణ పేద విద్యార్థులకు విద్య అందని ద్రాక్షగా మారిందన్నారు. నిధులివ్వకపోతే చలో అసెంబ్లీ కార్యక్రమం చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్కే అఫ్జర్, నాయకులు మహిపాల్, శంకర్, వినయ్, శృతి, స్ఫూర్తి, వెంకటేష్, రాకేష్ తదితరులున్నారు.

కార్మికులకు పనిభద్రత కల్పించాలి



కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సుభాష్‌నగర్ : భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలను పెంచాలని, పని భద్రత కల్పించాలని తెలంగాణ ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం (ఐఎఫ్‌టీయూ) జిల్లా ప్రధానకార్యదర్శి ఎం సుధాకర్ డిమాండ్‌చేశారు. ఈమేరకు బుధవారం ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఏవో ప్రశాంత్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ భవన, ఇతర నిర్మాణ కార్మికులకు మెరుగైన సంక్షేమ పథకాలను అమల్జేయాలన్నారు. కార్మికశాఖ లేబర్ కార్డులు ఇవ్వాలని, పెండింగ్ క్లెయిమ్స్ పరిష్కరించాలని పేర్కొన్నారు. పెళ్లి కానుక, ప్రసవ పథకాలను రూ.30వేల నుంచి రూ.లక్ష వరకు పెంచాలని డిమాండ్‌చేశారు. సహజ మరణానికి రూ. లక్ష నుంచి రూ. 5 లక్షలకు, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ. 6 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లేష్, మురళీ, లాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆరోపణలు అవాస్తవం



పెర్కిట్(ఆర్మూర్): నిజామాబాద్ ఎంపీ అర్వింద్‌పై ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి చేసిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని ఆర్మూర్ మున్సిపల్ మాజీ చైర్మన్, బీజేపీ నాయకుడు కంచెట్టి గంగాధర్ అన్నారు. పెర్కిట్‌లో బుధవారం గంగాధర్ మాట్లాడుతూ.. ఎంపీ అర్వింద్ నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ రైతుల సంక్షేమం కోసం గత ఎంపీ కవిత చేసిన దాని కంటే నాలుగు రెట్లు ఎక్కువ చేశారన్నారు. అలాగే స్పైసెస్ బోర్డు నుంచి రూ.38 కోట్లు మంజూరు చేయించిన ఘనత ఎంపీ అర్వింద్‌దేనన్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా ఎంపీ అర్వింద్‌పై ఆరోపణలు చేయడం సరికాదన్నారు.

108 అంబులెన్స్ తనిఖీ

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని 108 అంబులెన్స్‌ను ఉమ్మడి నిజామాబాద్, నిర్మల్ జిల్లాల ప్రోగ్రాం మేనేజర్ శ్రీకాంత్ బుధవారం తనిఖీ చేశారు. అత్యవసర పరిస్థితుల్లో అందిస్తున్న వైద్య సేవల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గర్భిణీలు ప్రసవ సమయంలో అంబులెన్స్‌లోనే ఆస్పత్రికి తరలించేలా పని చేయాలని సూచించారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	58,400	వెండి (కిలో)	71,300
22 క్యారెట్స్	53,835	- నిజామాబాద్ బిజినెస్	

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	10	20	క్యాప్సికం	30	50
బెండకాయ	60	80	గాజరుగడ్డ	25	40
జీరకాయ	60	80	పచ్చిమిర్చి	35	50
దొండకాయ	30	50	దోసకాయ	30	50
బీర్నీసుకాయ	30	50	ఆలుగడ్డ	20	40
కాకరకాయ	30	50	గోబిగడ్డ	10	20
వంకాయ	35	50	గోబిపువ్వు	20	40
పాలకూర	10	20	బీట్‌రూట్	20	40
మెంతికూర	25	40	గోరు చిక్కుడు	45	60
కొత్తిమీర	30	50	చిక్కుడుకాయ	45	60
పుదీనా	40	60			

- ఇందూరు

మాంసం ధరలు (రూ.)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సడ్	220
		లైవ్	180
స్కిన్‌లెస్	260	మటన్	750

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏపియన్)

స్క్రీన్-1-పఠాన్ (హిందీ)-10.35,1.30,4.20 7.15,10.10

స్క్రీన్-2- వాల్తేరు వీరయ్య -10.20 వీరసింహారెడ్డి -1.25, 10.30 హంట్-(తెలుగు)-7.40

స్క్రీన్-3- వాల్తేరు వీరయ్య -1.30,4.30,7.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1 -పఠాన్ - (హిందీ),9.30,12.45 4.00,7.15,10.30

స్క్రీన్-2 పఠాన్-(హిందీ)-10.00,1.15 7.45,11.00 -పఠాన్-(తెలుగు).4.30

స్క్రీన్-3- వాల్తేరు వీరయ్య -12.10,3.30,6.50 10.10

స్క్రీన్-4- పఠాన్-(తెలుగు)-11.45 వీరసింహారెడ్డి-3.00 వారసుడు-(తెలుగు)-6.30 హంట్-(తెలుగు)-10.00

దేవి	వీరసింహారెడ్డి
నటరాజ్	పఠాన్(హిందీ)
లలితామహల్	వాల్తేరు వీరయ్య
శ్రీదేవి	ధమాకా
విజయ్	పఠాన్ (తెలుగు)